క్లుప్తంగా

అన్నదానం



అన్నదానం చేస్తున్న న్యాయవాది రామగంగిరెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగర శివార్లలోని బృందా వృద్ధాశ్రమంలో సీనియర్ న్యాయవాది రామగంగిరెడ్డి కుమార్తె సాయి చంద్రిక జన్మదిన సందర్భంగా అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో రామగంగిరెడ్డి కుటుంబ సభ్యులు, వృద్ధాశ్రమ నిర్వాహకులు బాలసుబ్బయ్య, మేనేజర్ సుధారాణి, సీనియర్ న్యాయవాది హైమావతి, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుర్తింపు లేని విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

కడప ఎడ్యుకేషన్: జిల్లాలో గుర్తింపు లేని విద్యాసంస్థలతోపాటు అధిక ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు ఎరిపోగు రవి డిమాండ్ చేశారు. ఈ విషయమై శనివారం డీఈఓ కార్యాలయ ఏడీని కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థలు విద్యను వ్యాపారం చేస్తున్నాయన్నారు. ప్రభుత్వ నిబంధనలను పాటించడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ సహాయ కార్యదర్శి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వైవీయూ బీఈడీ, ఎంఈడీ పరీక్షల తనిఖీ



పరీక్షా కేంద్రాలను తనిఖీ చేస్తున్న వైవీయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం అనుబంధ కళాశాలలో జరుగుతున్న బీఈడీ, ఎంఈడీ 2, 4 సెమిస్టర్ పరీక్షలను వైవీయూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి తనిఖీ చేశారు. కడపలోని ఎస్వీ బీఈడీ కళాశాల, రాయచోటి రోడ్డులోని భారత్ బీఈడీ కళాశాల కేంద్రాన్ని తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రాల్లో సౌకర్యాలను ఆయన పరిశీలించారు. కేంద్ర అబ్జర్వర్లు పరీక్షలను కేంద్రంలో ఉండి పర్యవేక్షించగా, విశ్వవిద్యాలయ హైపవర్ కమిటీ బృందాలు అన్ని కేంద్రాలను తనిఖీ చేశారు. జిల్లాలోని 15 కేంద్రాల్లో 3,143 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య ఎన్. ఈశ్వర్ రెడ్డి తెలిపారు.

ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరంలోని నిరుద్యోగ మహిళలకు బ్యూటీషియన్ కోర్సులో 30 రోజులపాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నామని గ్యామ్ గ్లో బ్యూటీ ట్రైనింగ్ అకాడమి మేనేజర్ ఆద్య ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతి ఉత్తీర్ణులైన వారు ఇందుకు అర్హులన్నారు. ఆసక్తి గల వారు కో ఆపరేటివ్ కాలనీలోని ఎస్‌బీఐ బ్యాంకుపైభాగాన గల తమ సంస్థలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని, ఇతర వివరాలకు 99089 74770 నెంబరులో సంప్రదించాలన్నారు.

పఠనా సామర్థ్యాన్ని పెంపొందించాలి



విద్యార్థుల విద్యా ప్రమాణాలను పరిశీలిస్తున్న డీఈఓ మర్రెడ్డి అనురాధ

కడప ఎడ్యుకేషన్: విద్యార్థుల్లో పఠనా సామర్థ్యాల పెంపునకు ఉపాధ్యాయులందరూ కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి మర్రెడ్డి అనురాధ సూచించారు. శనివారం కడప మండల పరిధిలోని వాటర్‌గంటి ప్రాథమికోన్నత పాఠశాలను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలను పరిశీలించారు. పిల్లలకు అందించే మంచినీటి గురించి ఉపాధ్యాయులతో ఆరా తీశారు. విద్యా సామాగ్రి అందిందా లేదా అని పిల్లలను అడిగి తెలుసుకున్నారు. పరిశుభ్రమైన నీటిని అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం 5వ తరగతి విద్యార్థుల్లో పఠనా సామర్థ్యాలను పరిశీలించారు. తదనంతరం ఉపాధ్యాయులతో సమావేశాన్ని నిర్వహించి అకడమిక్ క్యాలెండర్‌పై చర్చించారు. ఉపాధ్యాయులంతా అకడమిక్ క్యాలెండర్ ప్రకారం ముందుకు సాగాలన్నారు. అలాగే విద్యార్థుల విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులందరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జగనన్నకు జననీరాజనం



వేంపల్లె వద్ద ప్రజలకు అభివాదం చేస్తున్న వైఎస్ఆర్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

వేంపల్లె : మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి వేంపల్లెలో అడుగడుగునా జననీరాజనాలు పలికారు. మూడు రోజుల జిల్లా పర్యటనలో భాగంగా ఆయన శనివారం వేంపల్లె బైపాస్‌రోడ్డు మార్గాన పులివెందులకు చేరుకున్నారు. ఈ నేపథ్యంలో హనుమాన్ జంక్షన్ వద్ద వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున ఘన స్వాగతం పలికారు. ప్రతి ఒక్కరినీ ఆయన ఆప్యాయంగా పలకరిస్తూ కరచాలనం అందించారు. బైపాస్‌లోని ఫ్యామిలీ రెస్టారెంట్ వద్ద, రాజు కాలనీ వద్ద పెద్ద ఎత్తున కార్యకర్తలు, నాయకులు, అభిమానులు హాజరై స్వాగతం పలికారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందరికీ అభివాదం చేస్తూ ఎవరూ అధైర్యపడకుండా ధైర్యంగా ఉండాలని భరోసానిచ్చారు. అనంతరం పులివెందులకు రోడ్డు మార్గాన బయలుదేరి వెళ్లారు. మూడు రోజుల పాటు పులివెందులలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో సమావేశం కానున్నట్లు సమాచారం. ప్రభుత్వ లోపాలను ఎప్పటికప్పుడు ఎండగట్టేలా ప్రజల్లోనే ఉండేందుకు అందరూ సిద్ధం కావాలని సూచిస్తున్నట్లు సమాచారం.

వేములలో..

వేముల : వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. కడప నుంచి పులివెందులకు బయలుదేరిన వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి దుగ్గన్నగారిపల్లె, కొత్తపల్లె, గొందిపల్లె, వేముల, జగనన్న కాలనీల వద్ద ప్రజలు, అభిమానులు బ్రహ్మరథం పట్టారు. ఆయా గ్రామాల వద్ద వైఎస్ జగన్ వాహనాన్ని నిలిపి కార్యకర్తలు, నాయకులను పేరుపేరునా పలకరించారు. దుగ్గన్నగారిపల్లె వద్ద స్కూలు విద్యార్థులతో ఆయన సెల్ఫీ దిగారు. అందరి యోగక్షేమాలు తెలుసుకుంటూ అభివాదం చేస్తూ పులివెందులకు బయలుదేరి వెళ్లారు.

పెండ్లిమర్రిలో..

పెండ్లిమర్రి : జిల్లా పర్యటనలో భాగంగా పులివెందులకు వెళుతున్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి శనివారం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అడుగడుగునా ఘన స్వాగతం పలికారు. కడప విమానాశ్రయం నుంచి పులివెందులకు రోడ్డు మార్గాన బయలుదేరిన జగన్‌కు పెండ్లిమర్రి మండలంలోని వైవీయూ క్రాస్ రోడ్డు, వెల్లటూరు, పెండ్లిమర్రి, నందిమండలం గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు.

జగ్జీవన్‌రామ్ సేవలు స్ఫూర్తిదాయకం



కడప సెవెన్‌రోడ్స్ : జగ్జీవన్‌రామ్‌కు నివాళి అర్పిస్తున్న ఏపీ దళితమిత్ర సంఘం ప్రతినిధులు

కడప సెవెన్‌రోడ్స్ : దేశానికి బాబు జగ్జీవన్‌రామ్ అందించిన సేవలు స్ఫూర్తిదాయకమని ఏపీ దళిత మిత్ర సంఘం ప్రతినిధులు కొనియాడారు. శనివారం బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా కడప నగరంలోని ఆయన విగ్రహానికి దళితమిత్ర సంఘం ప్రతినిధులు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ దేశానికి దిశా నిర్దేశం చేసి బాబు జగ్జీవన్‌రామ్ దేశాభ్యున్నతికి చేసిన సేవలు ప్రశంసనీయమన్నారు. అటువంటి మహనీయుడిని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ దళితమిత్ర సంఘం ప్రతినిధులు కైపు రామాంజనేయులు, ఎం.ప్రవీణ్ కుమార్, పి.మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

కడప ఎడ్యుకేషన్: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి బాబు జగ్జీవన్‌రామ్ అని పీఆర్ఎస్‌వైఎఫ్ రాష్ట్ర కన్వీనర్ కన్నెలూరు శంకర్, జిల్లా కన్వీనర్ ఒరుగంటి నాగేంద్ర అన్నారు. బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా శనివారం కడప నగరంలోని బాబు జగ్జీవన్‌రామ్ సర్కిల్‌లో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వేణ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక విప్లవ యోధుడు జగ్జీవన్ రామ్

కడప వైఎస్ఆర్ సర్కిల్: సామాజిక విప్లవ యోధుడు బాబు జగ్జీవన్ రామ్ అని గ్రేటర్ రాయలసీమ విద్యార్థి యువజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు పేర్కొన్నారు. శనివారం మాజీ ఉప ప్రధాని జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా నగరంలోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో దళిత మిత్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కైపు రామాంజనేయులు, జీఆర్ఎస్‌వైఎఫ్ నాయకులు శివ ప్రసాద్, సాయి, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు రాజశేఖర్ రెడ్డి, ఎస్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు ప్రసన్న, దళిత మిత్ర విద్యార్థి సంఘం నేత ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కడప వైఎస్ఆర్ సర్కిల్ : మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర తెలిపారు. శనివారం బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా నగరంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సమితి నాయకులు కె మునెయ్య, పి చంద్రగుప్త, ఏఐటీయూసీ నాయకులు లింగన్న, ఏఐఎస్ఎఫ్ నాయకులు చంద్ర, శివతేజ తదితరులు పాల్గొన్నారు.

నూతన కలెక్టర్‌కు శుభాకాంక్షల వెల్లువ



కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న రిజిస్ట్రార్ రఘునాథరెడ్డి



కలెక్టర్‌కు పూలగుచ్ఛం ఇస్తున్న 'నారాయణ' డీజీఎం రామ్మోహన్‌రెడ్డి



కార్యాలయంలో పూజలు నిర్వహిస్తున్న కలెక్టర్ శివశంకర్



మన చరిత పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ఇంటాక్ ప్రతినిధులు

కడప కార్పొరేషన్/ కడప కోటిరెడ్డి సర్కిల్: వైఎస్సార్ జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన శివశంకర్‌కు వైఎస్సార్‌సీపీ ఎస్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు, గిరిజన సేవా సమితి జిల్లా అధ్యక్షుడు బి. వేణుగోపాల్‌నాయక్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలో వారు అయన్ను కలిసి శాలువా కప్పి సత్కరించడంతో పాటు గౌతమ బుద్ధుడి జ్ఞాపిక అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

కలెక్టర్‌ను కలిసిన వైవీయూ రిజిస్ట్రార్

వైవీయూ: జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన లోతేటి శివశంకర్‌ను యోగివేమన విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా యోగివేమన విశ్వవిద్యాలయం ప్రగతి గురించి వివరించారు. సందర్శించాలని కోరారు. కలెక్టర్ విశ్వవిద్యాలయంలో అందిస్తున్న కోర్సులు, విద్యార్థుల వివరాల గురించి అడిగి తెలుసుకున్నారు.

'మన చరిత'ను ఆవిష్కరించిన కలెక్టర్

కడప కల్చరల్ : జిల్లాలోని చారిత్రక, వారసత్వ పర్యాటక ప్రదేశాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించి వాటిని రక్షించి భావితరాలకు అందించే ఉద్దేశ్యంతో ఇంటాక్ జిల్లా చాప్టర్ ప్రచురిస్తున్న (రెండవ) జులై బులెటిన్ ను కలెక్టర్ శివశంకర్, జేసీ గణేష్ కుమార్‌తో కలిసి ఆవిష్కరించారు. చాప్టర్ కన్వీనర్ లయన్ కె.చిన్నపరెడ్డి ఆధ్వర్యంలో శనివారం సంస్థ సభ్యులు కలెక్టర్‌ను ఆయన చాంబర్‌లో కలిసి సత్కరించి స్వాగతం పలికారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు భారవి , గౌరీ శంకర్, దేవతి రవి ,డాక్టర్ ఆర్ రంగనాథరెడ్డి, ఆచార్య సాంబశివారెడ్డి, రాఘవేంద్ర వర్మ, డాక్టర్ వెల్లాల వెంకటేశ్వర చారి తదితరులు పాల్గొన్నారు.

కడప ఎడ్యుకేషన్: జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన శివశంకర్‌ను నారాయణ విద్యాసంస్థల డీజీఎం రామ్మోహన్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

– మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డా. ఎం. చంద్రశేఖర్



డా. ఎం. చంద్రశేఖర్, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్

కడప కార్పొరేషన్: సీజనల్ వ్యాధుల నుండి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నగరపాలక సంస్థ హెల్త్ ఆఫీసర్ డా. యం. చంద్రశేఖర్ అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పారిశుధ్య పనులు వేగవంతంగా సాగుతున్నాయని తెలిపారు. వర్షాకాలం రావడంతో నివసించే ప్రాంతాలలో శుభ్రంగా ఉంచుకోవాలని, వర్షం నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. నిల్వ ఉన్న నీళ్లలో దోమలు ఉత్పత్తి అయి విష జ్వరాలు ప్రబలుతాయని, అలా విష జ్వరాలు రాకుండా ఉండాలంటే పరిసరాలు శుభ్రం చేసుకోవాలన్నారు. దోమలు ఉత్పత్తి కాకుండా నీళ్లనిల్వ ఉన్న ప్రాంతాలలో ఆయిల్ బాల్స్ వేస్తున్నామని తెలిపారు. వీటితోపాటు నగరంలోని హోటల్స్, చికెన్ షాపులు, మటన్ షాపులు, విజిట్ చేస్తున్నామని తెలిపారు. నగరంలో ఎప్పటికప్పుడు నిల్వ ఉన్న చెత్తను సేకరించి బయటకు తీసుకెళుతున్నామని తెలిపారు. చెత్త నిల్వ ఉన్న చోట చెత్తను సేకరించినప్పుడు ఆ ప్రాంతంలో బ్లీచింగ్ తప్పనిసరిగా చల్లుతున్నామని తెలిపారు. ఎప్పటికప్పుడు కాలువల్లోని వ్యర్థాలను తీసి నీరు నిల్వ ఉండకుండా... పారే విధంగా చేస్తున్నామని చెప్పారు. నగరపాలక సంస్థ ఏర్పాటుచేసిన కాల్ సెంటర్ కు ఫిర్యాదు అందిన వెంటనే సమస్యలు పరిష్కరిస్తున్నామన్నారు. అంతే కాకుండా నగరంలోని 50 డివిజన్లలో 202 స్లమ్ ఏరియాలను గుర్తించి ఆ ఏరియాలలో గ్యాంగ్ వర్క్ విడతల వారీగా చేస్తున్నామన్నారు. ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండి విష జ్వరాల బారిన పడకుండా ఆరోగ్యవంతమైన జీవితం గడపాలని కోరారు. అందుకోసం పారిశుధ్య సిబ్బంది శాయశక్తులా పనిచేస్తున్నారని తెలిపారు.

పాఠశాలలనిర్వహణ గ్రాంటు మంజూరుకు కృషి చేయాలి

కడప ఎడ్యుకేషన్: ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలకు నిర్వహణ గ్రాంటు మంజూరుకు కృషి చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇలియాస్‌బాష, సంగమేశ్వరరెడ్డిలు డీఈఓ మర్రెడ్డి అనురాధను కోరారు. ఈ విషయమై శనివారం డీఈఓ మర్రెడ్డి అనురాధను కలిసి వారు చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలకు మెయింటెనెన్స్ గ్రాంటు మంజూరు చేయలేదని, ఈ పరిస్థితుల్లో ప్రధానోపాధ్యాయులు సొంత డబ్బును పాఠశాలల నిర్వహణకు వెచ్చించాల్సి వస్తోందన్నారు. ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభమైన పరిస్థితుల్లో సీజన్ మారిన దృష్ట్యా అక్కడక్కడ కొన్ని డయేరియా కేసులు వెలుగు చేశాయని, దానికి ప్రధానోపాధ్యాయులను, ఎంఈఓలను బాధ్యులను చేస్తూ ఉన్నతస్థాయి అధికారులు మాట్లాడటం భావ్యం కాదన్నారు. మెయింటెనెన్స్ గ్రాంటు లేకుండా వాటర్ ట్యాంకుల పరిశుభ్రత ఎలా చేపట్టాలన్నారు.

ఖాజీపేట ఇన్‌చార్జి హెచ్ఎం సస్పెన్షన్‌పై పునరాలోచన చేయాలని, ఈ సమస్యలను డిపార్టుమెంట్ తరుపున రాష్ట్రస్థాయి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. డీఈఓను కలిసిన వారిలో ఎస్టీయూ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులతోపాటు రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాలగంగిరెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ చెన్నకేశవరెడ్డి పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధికి సహకరించాలి

కడప ఎడ్యుకేషన్: కడప మండల పరిధిలోని పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలని కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డిని కడప ఎంఈఓ-1 దిద్దకుంట గంగిరెడ్డి, ఎంఈఓ-2 ఇర్షాద్ అహ్మద్‌లు కోరారు. నూతనంగా కడప మండల విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు చేపట్టిన దిద్దికుంట గంగిరెడ్డి శనివారం ఎంఈఓ-2 ఇర్షాద్ అహ్మద్‌తో కలిసి కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డిని మర్యాద పూర్వంగా కలిశారు. ఈ సందర్భంగా వారు ఆమెకు పూలమొక్కను అందచేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వనరుల కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించి ప్రమాదాలను నివారించండి



రోడ్డు ప్రమాదాల నివారణపై ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు, కోర్టు సిబ్బంది

కడప అర్బన్: జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీదేవి, జిల్లా న్యాయసేవాధికారసంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ సూచనల మేరకు ద్విచక్ర వాహన దారులు హెల్మెట్ ధరించాలని కోర్టు సిబ్బంది, పోలీసులు ర్యాలీ నిర్వహించారు. రోడ్డు ప్రమాదాల నివారణ అంశాల అవగాహనకు ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీ గోకుల్ లాడ్జి నుంచి ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ సర్కిల్ వరకు నిర్వహించారు. ఈకార్యక్రమంలో కడప ఒన్‌టౌన్ సీఐ సి. భాస్కర్‌రెడ్డి, కోర్టు కానిస్టేబుళ్లు మహేష్, కిరణ్, ఇతర కానిస్టేబుళ్లు, పారా లీగల్ వాలంటీర్‌లు, సురేష్ సహాయం, శ్రీనివాసులు, ఈశ్వరయ్య, చిన్నగురవయ్య, లక్ష్మీ భవానీ, వెంకటసుబ్బయ్య, కోర్టు సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

మొక్కలు నాటి పరిరక్షించాలి



వైవీయూలో మొక్కలు నాటుతున్న ఎన్ఎస్ఎస్ పీఓలు, వలంటీర్లు

వైవీయూ: 'మాతృమూర్తి ప్రశంసగా ఒక మొక్కను నాటండి' అంటూ దేశ ప్రధాని నరేంద్రమోడీ పిలుపు మేరకు యోగివేమన విశ్వవిద్యాలయంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ -9, 3 ప్రోగ్రాం ఆఫీసర్లు కె. శ్రీనివాసరావు, డా. శ్రీధర్ రెడ్డి సంయుక్త ఆధ్వర్యంలో శనివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి వాటిని పరిరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో సహ ఆచార్యులు డా. బి.రెడ్డయ్య, కంప్యూటర్ సైన్స్ టెక్నాలజీ విభాగం విద్యార్థులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

చదువుతోపాటు స్కిల్స్‌ను అభివృద్ధి చేసుకోవాలి

కడప ఎడ్యుకేషన్: నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు చదువుతోపాటు స్కిల్స్‌ను అభివృద్ధి చేసుకుంటే జీవితంలో సులభంగా స్థిరపడేందుకు అవకాశం ఉంటుందని కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి పేర్కొన్నారు. కడప రిమ్స్‌రోడ్డులోని స్పిరిట్ డిగ్రీ కళాశాలలో కరస్పాండెంట్ నిర్మల అధ్యక్షతన నిర్వహించిన జాబ్ మేళాకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ జాబ్ మేళాలో 12 కంపెనీలు పాల్గొనగా 600 మంది విద్యార్థులు హాజరైనట్లు కళాశాల సంచాలకులు రవీంద్ర తెలిపారు. వీరిలో 129 మంది విద్యార్థులు వివిధ కంపెనీలకు ఉద్యోగాలకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు చేకూరుతుందని ఎంఈఓలు సావిత్రమ్మ, శోభారాణి పేర్కొన్నారు. స్థానిక కొత్రపాడు రోడ్డులోని రమణ మహర్షి హైస్కూల్‌లో పదవ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు శనివారం 1985-86లో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో ఉపకార వేతనాల పంపిణీ కార్యక్రమం జరిగింది.

ఈ సందర్భంగా ఎంఈఓలు మాట్లాడుతూ పూర్వవిద్యార్థులు తమకు విద్యాబుద్ధులు నేర్పి ఉన్నతులుగా తీర్చిదిద్దిన పాఠశాలకు తమ వంతు సహకారం అందించడం అభినందనీయమన్నారు. ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి మాట్లాడారు. పూర్వవిద్యార్థి, చాపాడు ఎంఈఓ వంశీకృష్ణ మాట్లాడుతూ తమకు విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాలకు 13 ఏళ్లుగా సేవ చేయడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఉత్తమ మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులకు రూ.20 వేలు అందించారు. అలాగే ప్రాథమిక, ప్రాథమికోన్నత విద్యార్థుల సౌకర్యార్థం రూ.40 వేల విలువ చేసే ఆటసామగ్రి, మైక్‌సెట్, సైన్స్ పరికరాలు, పుస్తకాలను అందజేశారు.

పెంపుడు జంతువులకు టీకాలు వేయించాలి

ప్రొద్దుటూరు : స్థానిక పశువైద్య కళాశాలలో శనివారం ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాసప్రసాద్ మాట్లాడుతూ లూయిస్ పాశ్చర్ తొలిసారిగా యాంటీరేబిస్ టీకాను విజయవంతంగా ఒక బాలుడికి ఇచ్చి ప్రాణాలు కాపాడినందుకు గుర్తుగా జూలై 6న ప్రపంచ జూనోసిస్ దినోత్సవం నిర్వహించుకుంటున్నామని తెలిపారు.

పెంపుడు జంతువుల ద్వారా అనేక వ్యాధులు వ్యాపిస్తాయన్నారు. యజమానులు పెంపుడు జంతువులకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని సూచించారు. జూనోటిక్ వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో 122 పెంపుడు జంతువులకు ఉచితంగా యాంటి రేబిస్ టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కె.అనూష, పశువైద్య చికిత్స సముదాయం విభాగాధిపతి డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ జ్యోతి, డాక్టర్ సుభాషిణి, డాక్టర్ రేవతి, డాక్టర్ శివసుదర్శన్, డాక్టర్ విద్యాసాగర్, తృతీయ, ఆఖరి సంవత్సరం పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యాధులు రాకుండా చూసుకోవాలి

మైదుకూరు : పెంపుడు జంతువుల ద్వారా వ్యాధులు రాకుండా యజమానులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మైదుకూరు ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి. నారాయణ రెడ్డి అన్నారు. ఆ కళాశాలలో జంతు శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ జూనోసిస్ డే ను నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెంపుడు జంతువులను సరైన పద్ధతుల్లో పెంచాలని తెలిపారు. వాటి ద్వారా వచ్చే అనేక వ్యాధులను పలు జాగ్రత్తలతో నివారించవచ్చని పేర్కొన్నారు. జంతు శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ సి.నరసింహారావు మాట్లాడుతూ 1885 జూలై 6న లూయిస్ పాశ్చర్ పిచ్చికుక్క కరిచిన బాలుడికి మొట్టమొదటి సారిగా వ్యాధి నిరోధక టీకా ఇచ్చి ప్రాణాలు కాపాడారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

ఊరిస్తున్న మేఘాలు..



సాగుకు సిద్ధం చేస్తున్న రైతులు



వర్షం కోసం ఎదురుచూస్తున్న రైతన్న

పులివెందుల రూరల్ : రోజురోజుకు ఆకాశంలో మేఘాలు ఊరిస్తున్నప్పటికీ వరుణదేవుడు కరుణించకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై 30 రోజులు గడుస్తున్నప్పటికీ వరుణదేవుడు కరుణించకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో చెరువుల్లో కూడా నీరు లేకపోవడంతో పంటలకు నీటి తడులు అందించలేని పరిస్థితి. గత 15 రోజుల క్రితం కురిసిన అడపదడప వర్షాలకు రైతులు నారుమడులు వేసుకున్నారు. అయితే కొద్దిరోజులుగా వర్షాలు లేకపోవడంతో రైతులు దిగాలు చెందుతున్నారు. ప్రతీరోజు సాయంత్రం ఆకాశంలో మబ్బులు ఏర్పడటం వర్షం వస్తుందని రైతులు ఆశగా ఎదురుచూడటం పరిపాటిగా మారింది. ఈ ఖరీఫ్‌లో పులివెందుల నియోజకవర్గ వ్యాప్తంగా సుమారు వేల ఎకరాలలో పంటలు సాగు చేశారు. చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి లింగాల కుడికాలువ, ఎడమ కాలువలకు నీరు రాకపోవడంతో రైతులు దిగాలు చెందుతున్నారు. వర్షాలు పడతాయనే ఉద్దేశంతో ఇప్పటికే రైతులు పంట పొలాల్లో తమ భూములను సిద్ధం చేసి ఉంచారు. వరుణదేవుడు కరుణించకపోతే రైతుల పరిస్థితి దయనీయంగా మారే అవకాశం ఉందని రైతులు వాపోతున్నారు. రెండు, మూడు రోజుల్లో వర్షాలు కురువకపోతే ఖరీఫ్ వరి సాగుపై ఆశలు వదులుకోక తప్పదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వరుణ దేవుడి కటాక్షం కోసం విరాఠ పర్వం పఠనం



విరాఠ పర్వం చదువుతున్న వక్తలు

పులివెందుల టౌన్ : స్థానిక శ్రీ వేంకటరమణుడు ఆలయంలో శనివారం వరుణదేవుడి కటాక్షం కోసం విరాఠ పర్వం పఠనం గావించారు. శ్రీమద్భాగవత ధర్మప్రచార సమితి ఆధ్వర్యంలో పలువురు వక్తలు విరాఠ పర్వం పఠనం వినిపించారు. విరాఠ పర్వం చదవడం వల్ల వరుణదేవుడి కటాక్షంతో సకాలంలో వర్షాలు కురిసి పాడిపంటలు బాగా పండుతాయని వారు తెలిపారు.

ప్రకృతి సోయగాల మధ్య నల్లగొండువారిపల్లె



గ్రామం చుట్టూ ఉన్న పచ్చని పొలాలు, కొండలు

పులివెందుల రూరల్ : ప్రకృతి సోయగాల మధ్య నల్లగొండువారి పల్లె గ్రామం పచ్చని అందాలతో కలకలలాడుతోంది. గ్రామం నుంచి ఎటువైపు చూ సినా పచ్చని పొలాలు, అరటి తోటలు, కొండలు దర్శనమిస్తున్నాయి. పులివెందుల నుంచి నల్లపురెడ్డిపల్లె, నల్లగొండువారిపల్లె మీదుగా వెళ్లే వాహనదారులు ప్రకృతి సోయగాల మధ్య గ్రామం ఎంతో పచ్చగా ఉందంటూ చర్చించుకుంటూ వెళుతున్నారు.